# చిన్నమ్మాయి

-వాణిశ్రీ

"ఏమయ్యోయ్! బజారుకెళ్తున్నావా?" అడిగింది సీతమ్మ భర్తని.

"ఏం? ఎందుకు?" అన్నాడు శేషయ్య.

"చిన్నమ్మాయికి ఐదొందలు కావాలంట"

"ఎందుకేం?"

"ఏదో అప్లికేషన్‌కట"

"ఎందుకొచ్చిన అప్లికేషన్స్? వేలకు వేలు తగలేస్తోంది. లంచాలు, రికమండేషన్లు లేకుండా ఈరోజుల్లో ఉద్యోగాలు వస్తాయా? పాడా? ఏ టైలరింగో నేర్చుకోమను" విసుగ్గా అన్నాడు శేషయ్య.

"డిగ్రీ చదివినదాన్ని టైలరింగ్ నేర్చుకోమంటావా? బాగుంది సంబడం. దాని అదృష్టం ఎలా ఉందో? గవర్నమెంటు ఉద్యోగం వస్తుందేమో? అప్లికేషనేగా పెట్టనిస్తే పోలా?"

"పోలా? అంటే పోతుందే డబ్బు. ఇక అదృష్ట మంటావా? నీకు అదుంటే లక్షణంగా ఇద్దరు కూతుళ్ల తరువాత కొడుకును కనేదానివి. ముగ్గురూ కూతుళ్లని కన్నావు"

"ఈరోజుల్లో కొడుకులైనా కూతుళ్లయినా ఒకటే. కొడుకులేమైనా ఉద్ధరిస్తున్నారా?"

"ఉద్ధరించకపోయినా లక్షణంగా ఉద్యోగాలు చూసుకుని ఎటువాళ్లటు పోయేవాళ్లు. కూతుళ్లకి చదువులు చెప్పించాలి. కట్నాలు పోసి పెళ్లిళ్లు చేయాలి. మళ్లీ పండుగలకి బట్టలు పెట్టమనీ, అది కొను ఇది కొను అని సతాయింపులు. పురుళ్లకి ఖర్చులు. ఇద్దరి పెళ్లిళ్లు చేసేసరికి తల ప్రాణం తోకకొచ్చింది. చిన్నమ్మాయికి పెళ్లెట్లా చేయాలా అని దిగులుతో నిద్రపట్టి చావడం లేదు" అంటూ ఐదొందలు తీసి సీతమ్మ చేతిలో పెట్టి వెళ్లిపోయాడు శేషయ్య.

శేషయ్య రిటైరైపోయి రెండేళ్లయింది. ఇద్దరి ఆడపిల్లల భారం వదిలించుకున్నాడు. ఇప్పుడు చిన్నమ్మాయికి పెళ్లి చేయాలి. డిగ్రీ చదువు కుంది కానీ ఏ ఉద్యోగం దొరకడంలేదు. అదే దిగులు శేషయ్యకి. రిటైరైనప్పుడు వచ్చిన డబ్బులో కొంత చిన్నామ్మాయి పెళ్లికని కొంత ఫిక్స్‌డ్ డిపాజిట్లో వేసి ఉంచాడు. కానీ ఆ డబ్బు ఏ మూలకీ చాలదనిపించి విచారిస్తుంటాడు. రోజురోజుకీ ధరలు ఆకాశానికి అంటుతున్నాయి. ఏం చేయాలో ఏమో? ఆ రోజు సాయంకాలం పార్కుకివెళ్లి కాలక్షేపం చేసి ఇంటికొచ్చాడు శేషయ్య.

"ఏమయ్యోయ్... ఇంటి ఓనరు వచ్చిపోయాడు. మూడునెలల్లో ఇల్లు ఖాళీ చేయాలన్నాడు. వాళ్లమ్మాయి వాళ్లొస్తారుట" అన్నది సీతమ్మ.

"సర్లే చూద్దాం... తప్పేదేముంది" అన్నాడు శేషయ్య.

"ఊరికి దూరంగానైనా ఏదో ఒక ఇల్లు చూసి కొనుక్కుంటే బావుంటుందయ్యా. ఎన్నాళ్లు ఎన్ని ఇళ్ళని మారతాం?" అన్నది సీతమ్మ.

"ఇల్లు కొనాలంటే మాటలా? ఊరి చివరైనా రేట్లు తక్కువ ఉన్నాయా? మండిపోతున్నాయి. పోనీ బ్యాంక్ లోన్ తీసుకుందామంటే రిటైరైపోయావు నీకెవరిస్తారు అంటున్నారు. అదే చిన్నమ్మాయి కొడుకై ఉంటే ఎంత బావుండేది?"

"చిన్నమ్మాయి కొడుకై ఉంటే ఏమయ్యేదేం? ఏం ఉద్ధరించేదంటా?"

"కొడుకైతే ఏదో ఒక ఉద్యోగం వచ్చి ఉండేది. బ్యాంక్ లోన్ తీసుకుని ఇల్లు కొనుక్కోవడానికి వీలయ్యేది. ముగ్గుర్నీ కూతుళ్లనే కన్నావాయె" అని భార్యని ఎత్తి పొడిచాడు శేషయ్య.

"ఏందయ్యోయ్! తప్పంతా నాదేనా? మీ వంశంలోనే వుంది. మీ అమ్మకు ముగ్గురు ఆడపిల్లల తరువాతేగా మీరు పుట్టింది? ఈసారి చూద్దామంటే మళ్లీ ఆడపిల్ల పుడితే కొంప మునుగుతుందని హడావుడిగా వెళ్లి ఆపరేషన్ చేయించుకొచ్చి నన్ను అంటావేమిటయ్యా" సీతమ్మ ఎదురుదాడికి దిగింది.

"సర్లే...సర్లే... ఆపు నీ సోది" విసుక్కున్నాడు శేషయ్య.

తల్లిదండ్రుల మాటలు చిన్నమ్మాయిని ఆలోచనలో పడవేస్తున్నాయి. తను ఆడపిల్లగా పుట్టినందుకు తండ్రి విచారిస్తున్నాడు. మగపిల్లవాడైతే చివరిరోజుల్లో ఆదుకునేవాడని అనుకోవడంలో అసహజమేమీలేదు. ఐతే ఆడపిల్లలు పెళ్లిళ్లు చేసుకుని అత్తవారింటికి ఎందుకు పోవాలి? పుట్టింట్లోనే ఉండి తల్లిదండ్రులను ఆదుకోవచ్చుగా? చిన్నమ్మాయి తీవ్రంగా ఆలోచిస్తోంది. పత్రికలలో మహిళా వ్యాపారవేత్తలు సాధిస్తున్న విజయాలు, కలెక్టర్లుగా, పోలీసు అధికారులుగా పని చేస్తున్న ఆడవాళ్ల గురించి వ్యాసాలు చదువుతుంటే తనకు తెలియని కొత్త లోకంలోకి అడుగుపెట్టినట్టు అనిపిస్తోంది. రాజకీయాలలో చక్రం తిప్పుతున్న నాయకురాళ్ల గురించి చదువుతున్నప్పుడు ఎంతో ప్రేరణ కలుగుతోంది. తను కూడా ఏదైనా సాధించాలి. సగటు ఆడపిల్లలా మిగిలిపోకూడదని అనుకుంది.

***

చిన్నమ్మాయికి పెళ్లి సంబంధం వచ్చింది. కుర్రాడు ఏదో కంపెనీలో ఫిట్టర్ అట. పర్మినెంట్ ఉద్యోగమనీ, మూడులక్షలు కట్నం అడుగుతున్నారనీ మధ్యవర్తి సంబంధం తెచ్చాడు.

"అమ్మా! నాకు పెళ్లి సంబంధాలు చూడకండి" తల్లితో అన్నది చిన్నమ్మాయి.

"అదేమిటే?"

"అదంతే. నేను పెళ్లి చేసుకుని అత్తగారింటికి పోను. ఇక్కడే ఉంటాను."

"అత్తగారింటికి పోనంటే అల్లుడు మనింట్లో ఉండాలా? భలే చెప్పావులే. ఈ రోజుల్లో ఇల్లరికం ఉండడానికి ఎవరొస్తారు? వెనకటిరోజుల్లో ఆస్తిపాస్తులు ఉంటే దర్జాగా బతకొచ్చని ఇల్లరికం ఉండేవాళ్లు" అన్నది సీతమ్మ.

"అదంతా నాకు తెలియదమ్మా. నేను అత్తవారింటికి వెళ్లను అంతే"

"బంగారంలాంటి సంబంధం కాళ్లదగ్గరకొస్తే కాదంటావా? నీకేం పోయేకాలం వచ్చిందే?"

"హూ... బంగారంలాంటి సంబంధమా? టెన్త్ చదివిన ఫిట్టర్‌కి మూడు లక్షల కట్నం ఇవ్వాలా? బుద్ధి లేకపోతే సరి. నేను డిగ్రీ చదివాను తెలుసా?"

"చదివావులే బోడి డిగ్రీ" విసుక్కుంది సీతమ్మ.

చిన్నమ్మాయి ధోరణి ఆమెకు నచ్చలేదు. శేషయ్య మాత్రం ఆలోచనలో పడ్డాడు. కంపెనీలో ఫిట్టర్ ఉద్యోగం పర్మినెంట్ ఏమిటి నా బొంద. కంపెనీ నష్టాల్లో పడితే అందర్నీ ఇంటికి పంపిస్తారు. అదేమైనా గవర్నమెంట్ ఉద్యోగమా? పైగా మూడులక్షల కట్నం? మధ్యవర్తికి 'నో' చెప్పాడు శేషయ్య.

చిన్నమ్మాయి తన మనసు తండ్రి అర్థం చేసుకున్నాడని సంతోషించింది.

***

కాలం గిర్రున తిరుగుతోంది. కేలండర్‌లో కాగితాలు మారుతున్నాయి. సీతమ్మకి చిన్నమ్మాయి పెళ్లి గురించి దిగులు పట్టుకుంది. చిన్నమ్మాయి ఉద్యోగాలకు అప్లికేషన్లు పెట్టడం, ఇంటర్వ్యూలకు తిరగడం చేస్తోంది. శేషయ్య మాత్రం కూతురు అదృష్టం ఎలా వుంటే అలా జరుగుతుందని సమాధానపడ్డాడు.

***

ఒకరోజు ఇంటిముందు పోలీసు వ్యాన్ ఆగింది. పోలీసు ఎస్ఐ బూట్లు టకటకలాడించుకుంటూ వస్తుంటే సీతమ్మ హడలిపోయింది. శేషయ్య తన ఇంటికి పోలీసులు ఎందుకొచ్చారో తెలియక ఆందోళన పడ్డాడు. ఇరుగుపొరుగు వారు ఆశ్చర్యంతో చూస్తున్నారు.

పోలీసు యస్ఐ ఎవరో కాదు... చిన్నమ్మాయే. టోపీ తీసి పకపకా నవ్వుతూ "అమ్మా" అంటూ తల్లిని తన చేతులతో చుట్టేసింది. ఇదంతా కలా? నిజమా? అనుకుంటూ చూస్తున్నాడు శేషయ్య.

చిన్నమ్మాయి మగపిల్లాడిలా క్రాఫ్ చేయించుకుంది. ప్యాంట్, షర్టుతో అచ్చం మగాడిలా కనిపిస్తోంది. చిన్నమ్మాయి మగాడిలా మారిపోయి తనకు కొడుకులు లేని లోటు తీరుస్తున్నట్లు భ్రమ కలుగుతోంది శేషయ్యకి. అతని కళ్లల్లోంచి ఆనందభాష్పాలు రాలుతున్నాయి. ★

